ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025 5

శ్రీ సత్యసాయి



రేషన్‌లో కందిపప్పు కోత

ఉమ్మడి జిల్లాలో 12,29,132 కార్డులకు అందని వైనం

ప్రజాశక్తి-హిందూపురం



కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరాకు మంగళం పలికింది. అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తామంటూ ప్రకటనలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆచరణలో పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. కేవలం బియ్యం, అరకొరగా పంచదార పంపిణీ చేసి చేతులు దులుపుకుంటుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 1641 రేషన్ షాపులకు 6,62,014, శ్రీసత్య సాయి జిల్లాలో 1357 రేషన్ షాపులకు 5,67,118 కార్డులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో జిల్లా వ్యాప్తంగా 2998 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులు 12,29,132 ఉన్నాయి. ప్రతి కార్డుకు ఒక కేజి కంది పప్పు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వం ప్రతినెలా 12.291 క్వింటాళ్ల కందిపప్పును సరఫరా చేయాల్సుంది అయితే గత ఆరు నెలల నుంచి కంది పప్పుకు ప్రభుత్వం మంగళం పాడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే ఎండియు వాహనాలతో పంపిణీకి చాపచుట్టేసిన విషయం తెలిసిందే. మరోవైపు ప్రజలకు అత్యవసరమైన కందిపప్పు సరఫరాకు మంగళం పాడేసింది. నెలనెలా కందిపప్పు లబ్దిదారులకు సరఫరా చేయాలంటే సుమారు 1229 టన్నులు అవసర మవుతుంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి మూడు నెలలు మొక్కుబడిగా కందిపప్పు సరఫరా చేసింది. లబ్ధిదారుల్లో సగం మందికి అందేది కాదు. ఇక రాను రాను పంపిణీని నిలిపేసింది. వచ్చే నెలలో పంపిణీ చేస్తామంటూ పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ నెలకానెల చెబుతూ వస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులకు నిరాశ తప్పడం లేదు. ఈ నెల కూడా కందిపప్పు రాలేదని డీలర్లు చెబుతుండటంతో చేసేది లేక ఇచ్చిన బియ్యం తీసుకుని వెనుతిరుగుతున్నారు.

పెరిగిన ధరలతో అవస్థలు

ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో రూ.130 నుంచి 160 రూపాయల వరకు ఉంది. రేటు ఎక్కువగా ఉన్నప్పుడు సబ్సిడీపై ఇవ్వలేని ప్రభుత్వం, కనీసం ధర తక్కువగా ఉన్నప్పుడైనా ప్రజలకు అందించేందుకు ముందుకు రావడం లేదు. మూడు నెలల క్రితం బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పురూ.180 వరకూ పలికింది. ఈ ధర రెండు నెలల పాటు కొనసాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమయంలో సబ్సిడీ ధరకు కందిపప్పు సరఫరా చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. 'కూటమి ప్రభుత్వం వస్తుంది..మీ కష్టాలు తీరుస్తుంది' అని ఊదరగొట్టిన పాలకులు పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకపోగా, చివరికి కందిపప్పును కూడా కార్డుదారులకు పంపిణీ చేయక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్లో ఆయిల్, కందిపప్పు ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేయడం తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. చౌక దుకాణాల్లో కేజీ రూ.67కు అందాల్సిన కంది పప్పును బయట మార్కెట్లో రూ.130 నుంచి రూ.160 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

డీడీలు తీయని రేషన్ డీలర్లు

డీలర్లు ప్రతి నెలా 20వ తేదీ లోపు డీడీలు తీసి తమ పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు దిగుమతి చేసుకుంటారు. అయితే కొన్ని నెలలుగా డీలర్లు డీడీలు తీస్తున్నా పౌర సరఫరాల శాఖ మాత్రం అవసరమైన మేరకు కందిపప్పు సరఫరా చేయడం లేదు. ప్రస్తుతం కందిపప్పు కోసం డీడీలు తీయవద్దని డీలర్లకు ముందుగానే అధికారులు సమాచారం ఇస్తున్నారు. దీంతో వారు డీడీలు కట్టడం మానేశారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు కావాలని కార్డుదారులు అడుగుతుంటే తమకే రాలేదని డీలర్లు బదులిస్తున్నారు. ప్రస్తుత నెలలో సైతం హిందూపురం రూరల్ మండలంలో బియ్యంతో పాటు పంచదార వేస్తున్నారు. హిందూపురం పట్టణంలో కేవలం బియ్యంతో సరిపెడుతున్నారు.

నిర్లక్ష్యం ఖరీదు... నిండు ప్రాణం

నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలికొంది. ఇద్దరు బిడ్డలకు తల్లిని దూరం చేసింది. దంపతుల అమాయకత్వం, అవగాహన లేమి, అన్నీ తెలిసిన అధికారులు, కాసులకు కక్కుర్తి పడిన వైద్యుల నిర్లక్ష్యం ఒక నిండు గర్భిణిని బలికొంది. వైద్య శాఖ అధికారులు మాత్రం ఇప్పటికే ఆసుపత్రిని వేర్వేరు పేర్ల మీద రెండుసార్లు సీజ్ చేశామని, ప్రస్తుతం శ్రీకృప పేరు మీద అనుమతులు కోరినా ఇవ్వలేదని దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు.

ప్రజాశక్తి - అనంతపురం



మృతురాలి కూతురు, కుమారుడు

'అనంత'లో అబార్షన్ వికటించి గర్భిణి మృతి

కాసులకు కక్కుర్తి పడిన వైద్యుడు

అనుమతులు లేకున్నా అబార్షన్‌కు ఒప్పుకున్న వైనం

ఆపరేషన్ థియేటర్ లోనే ప్రాణాలు వదిలిన మహిళ గర్భిణి

ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు

అనంతపురం నగరంలోని రామచంద్రనగర్‌లో శ్రీకృప మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని డాక్టర్ బి.రమణ నాయక్ నిర్వహిస్తున్నారు. గత మూడు నెలలుగా అనుమతుల కోసం జిల్లా వైద్యశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటికే బ్లాక్‌లిస్టులో ఉన్న ఆసుపత్రి కావడంతో అధికారులు అనుమతులు ఇవ్వలేదు. అయితే కొంతమంది వైద్య శాఖ అధికారుల సలహాతో ఆ వైద్యుడు ఆసుపత్రికి అనుమతులు లేకుండా నడుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం బుక్కరాయసముద్రం మండలం చెదల్ల గ్రామానికి చెందిన మల్లికార్జున అతని భార్య ఐదునెలల గర్భిణి రాధిక (34) అబార్షన్ నిమిత్తం ఆశా వర్కర్ల సహాయంతో వైద్యుడిని సంప్రదించారు. వీరు అప్పటికే పలుచోట్ల ప్రయత్నం చేసినా అబార్షన్‌కు ఒప్పుకొని పరిస్థితి ఉండడంతో డాక్టర్ రమణ నాయక్ ను సంప్రదించారు. ఇప్పటికే ఆ దంపతులకు ఐదు సంవత్సరాల పాప అమల, రెండు సంవత్సరాల బాలుడు మోహన్ సాయి ఉన్నారు. కాగా మూడవ బిడ్డను వద్దని అబార్షన్ చేయడం కోసం వైద్యులను శుక్రవారం ఆశ్రయించారు.



మృతురాలు రాధిక

కాసులకు కక్కుర్తి పడిన వైద్యులు ఆదివారం నాడు డబ్బులు సిద్ధం చేసుకోవాలని అబార్షన్ చేస్తామని సూచించారు. అనుకున్న రీతిలో ఆదివారం రాధికా దంపతులు శ్రీకృప ఆసుపత్రికి చేరుకున్నారు. అబార్షన్‌కు సిద్ధం చేసిన వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు రాధికను తీసుకువెళ్లారు. అయితే ఆపరేషన్ థియేటర్లో అబార్షన్ చేస్తున్న సమయంలో వైద్యం వికటించి రాధిక అక్కడికక్కడే మృతి చెందింది.రాధిక మృతి చెందడంతో పెద్ద ఎత్తున మృతురాలి కుటుంబ సభ్యులు బంధువులు ఆసుపత్రి బయట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని సంబంధిత కుటుంబీకులు ఆసుపత్రిపై దాడి చేశారు.

నిబంధనలకు తిలోదకాలు : ఆసుపత్రికి అనుమతులు లేకున్నా డాక్టర్ రమణ నాయక్ వైద్యం చేసేందుకు ఒప్పుకోగా మరోవైపు అనస్తీసియాను అదే ఆసుపత్రిలో ఉన్న డెంటల్ వైద్యురాలు లావణ్య ఇవ్వడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నది వాస్తవం. కాగా ఇప్పటికే ఆ ఆసుపత్రిలో రెండు పర్యాయాలు ఇలాంటి సంఘటనలు జరిగినా, జిల్లా వైద్యశాఖ అధికారులు అనుమతులు లేకున్నా పట్టించుకోని పరిస్థితి పట్ల పౌరసంఘాలు అభ్యంతరం వ్యక్తపరుస్తున్నాయి. జిల్లా వైద్యశాఖ అధికారుల సైతం అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహించడం తెలియకపోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల అండదండలు లేకుంటే ఆసుపత్రిని ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆసుపత్రికి అనుమతులు లేకుండా వైద్యశాఖ, వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు పట్ల తీవ్రమైన ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మూడవ పట్టణ సిఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, కుటుంబసభ్యులు

అధిక రక్తస్రావంతోనే...

అబార్షన్ కోసం తమను ఆశ్రయించారు. అయితే అప్పటికే పలుచోట్ల ఇతర మందులు వాడడం వల్ల అంతర్గతంగా పలు సమస్యలు చోటుచేసుకున్నాయి. అబార్షన్ చేసే సమయంలో రక్తస్రావం నియంత్రించేందుకు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది.

డాక్టర్ రమణ నాయక్,
శ్రీకృప ఆసుపత్రి వైద్యులు
అనంతపురం

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రికి అనుమతులు లేనిది వాస్తవం. చట్టపరంగా అనుమతులు లేకుండా చికిత్స చేయకూడదు. ఆపరేషన్ చేయడంతో గర్భిణి మృతి చెందిందని ఫిర్యాదు అందింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆసుపత్రిని సీజ్ చేశాం. ఆసుపత్రి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటాం.

అనుపమ జేమ్స్,
ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఓ

విద్యార్థుల హక్కులను హరిస్తున్న పాలకులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కిల్లో జీవో ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహించడం కోసమని అన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అని విమర్శించారు.విద్యార్థులకు నాయకత్వలక్షణాలు, ప్రజాజీవితంపై అవగాహన, హక్కులు, బాధ్యతలను విద్యార్థి సంఘాలు తెలియజేస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెనక్కితీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జయంతులకు జనం డబ్బులా? : జెవివి

ప్రజాశక్తి హిందూపురం

బాధ్యతగా ఉండాల్సిన ప్రభుత్వాలు బాబాల జయంతులకు జనం డబ్బును వినియోగించడం క్షమించరాని నేరమని జనవిజ్ఞాన వేదిక నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని అల్ హీ లాల్ పాఠశాల ఆవరణంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలను ఒక పండగ లాగా జరపాలని జీవో నెంబర్ 862 విడుదల చేసిన ఉత్తర్వులను చించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ ఈటి రామమూర్తి, చైతన్య గంగిరెడ్డి, రామకృష్ణ, ప్రముఖ రచయిత కల్లూరు రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రజలు పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్న డబ్బుల్లో 50 శాతం బడుగు బలహీన నిరుపేదలదే అన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులను ప్రజాభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం వెచ్చించాల్సిన ప్రభుత్వం బాధ్యతను విస్మరించి సన్యాసులు, బాబాలు, గురువులు, పీఠాధిపతుల జయంతిలకు, జన్మదిన వేడుకలకు ఖర్చు చేయడం తగదన్నారు. రాష్ట్రంలోని శ్రీ సత్య సాయి జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతం అన్నారు. నదుల నీరు సముద్రం పాలవుతున్నా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో హంద్రీనీవా కాలువలు ఉన్నప్పటికీ ఆ కాలువల ద్వారా చెరువులకు నీళ్లు నింపాల్సి ఉన్నప్పటికీ పాలకులు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పూర్తిస్థాయిలో చెరువులు, చెక్ డాములకు హంద్రీనీవా కాలవల ద్వారా నీటితో నింపితే భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లో నీళ్ల సమృద్ధిగా ఉంటాయన్నారు. తద్వారా వ్యవసాయ అభివృద్ధి జరుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకొని పేద ప్రజల డబ్బులు వారి కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు జిఆర్ శ్రీనివాసులు, నారాయణస్వామి, లక్ష్మీపతి, మురళీ మోహన్, రామకృష్ణ, ఉగ్రప్ప, తిప్పేస్వామి, బాలగంగాధర్ నాయక్, మల్లికార్జున, ఉమా మహేష్, అలీముల్లా, అతావుల్లా, మంజుళ, సన్నిరమ్మ, గాయత్రి, జయమ్మ, శ్వేతలత తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యం

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక ముందుకు పోతోందని ఆ జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు అన్నారు. ఆదివారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో జన విజ్ఞాన వేదిక జోనల్ మహాసభ జరిగింది. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ ఈటి రామ్మూర్తి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, ప్రముఖ రచయిత కల్లూరు రాఘవేంద్రరావు, చైతన్య స్వచ్ఛంద సంస్థ గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెల మూర్ఛ వ్యాధి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మూర్ఛ రోజులకు వైద్య సేవలను అందించడంతో పాటు వారికి మందులను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. దీంతోపాటు ప్రజలకు సైన్స్ పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, మూఢనమ్మకాల నిర్మూలనకు



జోనల్ మహాసభలో పాల్గొన్న జెవివి నాయకులు


కృషి చేస్తున్నామన్నారు. మూఢనమ్మకాలు సమాజ ప్రగతికి ఆటంకాలుగా మారుతాయన్నారు. ప్రజాధనాన్ని బాబాల జయంతులకు ప్రభుత్వం ఖర్చు పెట్టడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలన్నారు. జోనల్ మహాసభలో వీరితో పాటు జన విజ్ఞాన వేదిక నాయకులు జిఆర్ శ్రీనివాసులు, నారాయణస్వామి, లక్ష్మీపతి, మురళీ మోహన్, రామకృష్ణ, ఉగ్రప్ప, తిప్పేస్వామి, బాలగంగాధర్ నాయక్, మల్లికార్జున, ఉమా మహేష్, అలీముల్లా, అతావుల్లా, మంజుళ, సన్నిరమ్మ, గాయత్రి, జయమ్మ, శ్వేతలత తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డ్రింక్ కేసుల పేరుతో డబ్బులు వసూలు

మధ్యవర్తులకు ఫోన్‌పే చేయించుకున్న పోలీసులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఓపెన్ డ్రింక్ చేస్తున్న వారిపై పోలీసులు తనిఖీలు నిర్వహించడం సాధారణమే. అయితే ఇటీవల మండల కేంద్రంలో ఓపెన్ డ్రింక్ కేసుల పేరుతో కొందరు పోలీసులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో చిలమత్తూరు గ్రామ శివారులో ఓపెన్ డ్రింక్ చేస్తున్న కొంతమందిని ఓ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పట్టుకున్నారు. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో కేసు నమోదు చేసి కోర్టుకు పంపాల్సి ఉంటుంది. కానీ, పోలీసులు రూ. 10 వేలు డిమాండ్ చేయగా, చివరకు రూ. 2 వేలకు బేరసారాలకు దిగి, నిందితుల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బాధితుల కథనం ప్రకారం రాత్రి 11 గంటల సమయంలో వారిలో ఒకరి నుంచి ఫోన్ పే ద్వారా రూ. 2 వేలు తీసుకున్నారు. గంగోత్రి హోటల్‌లో పనిచేసే ఒక వ్యక్తికి ఆ డబ్బును పంపినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయకుండా, సెల్ ఫోన్లు లాక్కొని డబ్బులు వసూలు చేయడంపై బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



మధ్యవర్తికి ఫోన్ పే పంపిన స్క్రీన్ షాట్

స్వయం పోషక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతాం

రెండు వేల మార్కు దాటిన విద్యార్థుల సంఖ్య

జెఎన్‌టియు వైస్ ఛాన్స్‌లర్ హెచ్.సుదర్శన్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుని స్వయం పోషక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు వైస్ ఛాన్స్‌లర్ హెచ్.సుదర్శన్‌రావు పేర్కొన్నారు. అనంతపురం జెఎన్‌టియులో జరుగుతున్న అభివృద్ధి అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.



ప్రశ్న : అనంతపురం జెఎన్‌టియు అభివృద్ధి కార్యక్రమాలు ఏమి నడుస్తున్నాయి. ?

జవాబు : అనంతపురం జెఎన్టీయుని అత్యుత్తమ సాంకేతిక విద్యాలయంగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాలు చర్యలు చేపడుతున్నాం.ఇప్పటికే స్వయం పోషక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా జెఎన్‌టియు పరిధిలోని కలికిరి, అనంతపురం ,పులివెందుల, ఓటిపిఆర్ఐ కళాశాల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచనున్నాం. నాలుగు క్యాంపస్‌లలో కలిపి మొత్తం 24 వేల మంది విద్యను అభ్యసించేలా మార్పులు తీసుకురావాలన్నది లక్ష్యం. తద్వారా విశ్వవిద్యాలయం స్వయంపోషక విశ్వ విద్యాలయంగా మార్చేందుకు కృషి చేస్తాం.

ప్ర : కొత్తగా మరో కళాశాల జెఎన్‌టియు పరిధిలోకి చేరనుందా ?

జ : చిత్తూరు జిల్లాలోని కళాహస్తిలో ఎండోమెంట్ పరిధిలోనున్న ఇంజనీరింగు కళాశాలను కూడా అనంతపురం జెఎన్‌టియు పరిధిలోకి తీసుకొచ్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వముంది. ఇప్పటికే అటువంటి ప్రక్రియ ప్రారంభమైంది. అధికారిక ఉత్తర్వులు ఇంకా రావాల్సి ఉంది. ఈ ఏడాది కౌన్సిలింగులోనే ఆ మార్పు కనిపిస్తోంది. జెఎన్‌టియు అనంతపురం పరిధిలోకి ఈ ఏడాది కొత్త కళాశాల రాబోతోంది.

ప్ర: విశ్వవిద్యాలయం పరిధిలో ప్లేస్‌మెంట్స్ పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ : ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఆ దిశగానే సాంకేతిక విద్యను అందివ్వడంతోపాటు నైపుణ్యం పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇవే కాకుండా కియా, జెఎస్‌డబ్లు సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. మరికొన్ని సంస్థలతో ఒప్పందాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్ర: మౌళిక సదుపాయల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : మౌళిక సదుపాయల మెరుగుదలపైనా దృష్టి సారించాం. ఓటిటిఆర్ఐలో నడుస్తున్న ఫార్మసీ కళాశాలకు ఇప్పటి వరకు పాత భవనంలో ఉంది. అక్కడ రూ.20 కోట్లతో నూతన భవన నిర్మాణంతోపాటు హాస్టల్ వసతి కల్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పులివెందులలోనూ రూ.25 కోట్లతో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి తాత్కాలిక భవనం కింద ఇచ్చిన భవనాన్ని ఈ ఏడాది స్వాధీనం చేసుకోనున్నాం. అక్కడ ఎంబిఎ కళాశాలను ఏర్పాటు చేయనున్నాం.

ప్ర: పరిశోధనలు ఏ విధంగా నడుస్తున్నాయి ?

జ : పరిశోధనలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఆయా విభాగాలన్నింటికీ అధ్యాపకులకు పరిశోధనల కోసం గ్రాంటు కేటాయించియున్నాం. మొత్తంగా పరిశోధనల కోసం వివిధ సంస్థల నుంచి ఏడు కోట్ల రూపాయల వరకు నిధులు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా అవి నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో విశ్వవిద్యాలయం నాలెడ్జ్ పార్టినర్‌గా ఉంటుంది.



జెఎన్‌టియు విసి సుదర్శనరావు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో చేస్తున్న దోపిడీని తక్షణమే అరికట్టాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ విధానాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకి వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.మధు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకి వ్యతిరేకంగా, పేద, మధ్య తరగతి కుటుంబాలు, రైతులపై విద్యుత్ భారం వేయరాదని, ఎన్నికల హామీలు అమలు, తదితర డిమాండ్లతో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 5వ తేదీ పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.హెచ్ బాషా, పట్టణ కార్యదర్శులు ఎ.మారుతి, పి.రవి, సిఐటియు నాయకులు జెవి.రమణ, టి.అయూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

హోరాహోరీగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ లకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. టోర్నమెంట్ కన్వీనర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 2 మ్యాచ్‌లు జరిగాయి. తొలి మ్యాచ్‌లో గోరంట్ల, చిలమత్తూరు జట్లు తలపడ్డాయి. మొదట గోరంట్ల జట్టు 12 ఓవర్లకు 83 పరుగులు చేయగా చిలమత్తూరు జట్టు 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి గెలుపొందింది. రవికుమార్‌కు గోరంట్ల యుటిఎఫ్ నాయకులు నాగరాజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందజేశారు. రెండో మ్యాచ్‌లో రొద్దం సూపర్ కింగ్స్, గుడిబండ జట్లు తలపడ్డాయి. ముందుగా గుడిబండ జట్టు 63 పరుగులు చేయగా రొద్దం జట్టు 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా విజయం సాధించింది. సానిపల్లి గంగాధర్‌కు సురేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ నాయకులు గంగాధర్, శివయ్య, ఆదినరేష్ జైన్, విష్ణు, జగదీశ్, నరేష్‌బాబు, కాశీ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన వారికి సన్మానం

రొద్దం: మండలంలోని కందుకూర్లపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉప్పర అంజనప్ప(టీచర్), కురుబ విజయ్‌కుమార్(పోలీస్)లకు ఆదివారం గ్రామస్తులు గ్రామ నడిబొడ్డున పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని మాజీ సర్పంచ్ అశ్వర్థ నారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న గుర్తింపు మరే దానిలో ఉండదని, యువత చదువుపై శ్రద్ధ చూపాలన్నారు.

వివాహ వేడుకలో సినీ తారల సందడి



వధూవరులకు కానుక అందజేస్తున్న నారా రోహిత్

కొత్తచెరువు: స్థానిక టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి చిన్నపోతుల లక్ష్మీనారాయణ కుమారుడు సంతోష్ వివాహం గత శనివారం హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా సాగింది. స్థానిక మామిళ్లకుంట క్రాస్‌లోని ఎస్‌జి కన్వెన్షన్ హాలులో ఆదివారం వివాహ రిసెప్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు సినీ నటులు నారా రోహిత్, మంచు మనోజ్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పే స్వామి హాజరై నూతన వధూవరులు సంతోష్, ప్రియదర్శినిలను ఆశీర్వదించారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా పంపించిన పెళ్లి కానుకను స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి లక్ష్మీనారాయణ నూతన వధూవరులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, ఎమ్మెల్యే పిఎ సంతోష్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినీ నటుడు మంచు మనోజ్‌ను కలిసిన జయప్రకాష్

పుట్టపర్తి రూరల్: సినీనటుడు మంచు మనోజ్‌ను ఆదివారం పుట్టపర్తిలో తెలుగు యువత నాయకుడు కొత్తపల్లి జయప్రకాష్ మర్యాద పూర్వకంగా కలిశారు. జయప్రకాష్ ప్రశాంతి నిలయంలో మంచు మనోజ్‌ను కలిసి శ్రీసత్యసాయి బాబా చిత్రపటాన్ని అందజేశారు. అలాగే మనోజ్‌కు పుట్టపర్తి ప్రాముఖ్యతను తెలియజేశారు. సత్యసాయి శతజయంతికి పుట్టపర్తికి రావాలని ఆహ్వానించారు. జయప్రకాష్‌తో పాటు ఐటిడిపి సాయి తేజ, నరసింహులు ఉన్నారు.

కేబుల్ నెట్‌వర్క్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

రోడ్డుకు ఇరువైపులా గుంతలమయం

ప్రజాశక్తి-రొద్దం

ఎయిర్‌టెల్, జియో కేబుల్ నెట్‌వర్క్ కంపెనీల కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం అంతా ఇంతా కాదని స్థానికులు మండిపడుతున్నారు. ఏడాది క్రితం ఆయా నెట్‌వర్క్ కంపెనీలు మండలంలో రోడ్డుకు ఇరువైపులా కేబుల్ లాగేందుకు సుమారు 4 అడుగుల మేర గుంతలు తవ్వారు. కేబుళ్లు ఏర్పాటు చేసిన తర్వాత వాటిని సక్రమంగా పూడ్చలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో భాగంగా పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఎంపిడిఓ కార్యాలయం పక్కనే గౌరాజుపల్లికి వెళ్లే రహదారిలో మట్టి పూర్తిగా కుంగి పోయింది. గుంతలు 4 అడుగుల మేర లోతు ఉండడంతో రాత్రి వేళలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారిలో రాత్రి వేళ కియా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పలు చోట్ల రోడ్డుకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ గుంతలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుకి ఇరువైపులా గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

తొట్టె నిర్మించారు.. నీరు నింపడం మరిచారు..!

సోమందేపల్లి: పశువుల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నీటి తొట్టెలు నిర్మించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మండలంలోని రంగేపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో రూ. 33,220 వెచ్చించి రెండు నెలల క్రితం నీటి తొట్టెను నిర్మించారు. అయితే అధికారులు అందులో నీరు నింపడం మర్చిపోయారు. దీంతో తమ పశువులు, గొర్రెలకు నీరు తాపేందుకు అటుగా తీసుకెళ్లిన కాపరులు తొట్టెలో నీరు లేక పోవడం చూసి అసహనం వ్యక్తం చేస్తూ వెనుతిరిగి వెళ్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తొట్టెలను నీటితో నింపాలని పశు వుల కాపరులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న నీటి తొట్టె

ప్రయివేటు బస్సులతో ఆర్టీసీకి, వ్యాపారులకు నష్టం..!

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఎపిఎస్ ఆర్‌టిసి ఆదాయానికి గండి కొడుతూ, బస్టాండ్ సమీపంలోని వాణిజ్య సముదాయాల్లోని వ్యాపారులకు నష్టం కలిగిం చేలా ప్రయివేట్ బస్సుల యాజమా న్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రయి వేటు బస్సు సర్వీసులను నియంత్రించాల్సిన ఆర్‌టిసి, పోలీసు, రవాణా శాఖల అధికారులు ఆర్‌టిసికి, ప్రయివేటు వ్యాపారులకు ఎవరికి ఎలాంటి నష్టం జరిగితే మాకేంటి సంబంధం అన్నట్లుగా చోద్యం చూస్తున్నారన్న వాదనలు పట్టణంలో వినిపిస్తున్నాయి.



అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రయివేట్ బస్సు

వివరాలు.. కదిరి పట్టణంలోనీ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వాణిజ్య సముదాయాల్లో హోటల్, ఫాస్ట్‌ఫుడ్, కిరాణా దుకాణం, తదితర వ్యాపారాలు చేసుకునేందుకు నెలకు రూ. 60 వేల అద్దె భారమని తెలిసినా వ్యాపారాలు బాగా జరిగితే వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని కుటుంబానికి, మిగిలిన దాంట్లో షాపు అద్దె చెల్లించవచ్చన్న ఆలోచనతో టెండర్ల ప్రక్రియ ద్వారా రూములు దక్కించుకున్నారు. అయితే ఇటీవల కాలంలో ప్రయివేట్ బస్సులను గంటల తరబడి వాణిజ్య సముదాయాలు ముందు నిలుపుతున్నారు. దీంతో సరిగా వ్యాపారాలు జరగక కనీసం అద్దె చెల్లించడం కూడా భారమైందని వ్యాపారులు వాపోతున్నారు. దీనికి తోడు పోలీసులు సైతం ఆర్టీసీ ఆదాయానికి నష్టం కలిగేంచేలా ప్రయివేటు బస్సులుకు లాభం చేకూర్చేలా బస్సులు నిలపడం కోసం బస్టాండ్ ముందు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పరోక్షంగా తమకు వ్యాపారాలు సాగకుండా, ఆర్టీసీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు.

స్పందించని ఆర్టీసీ అధికారులు..

రవాణా చట్టం ప్రకారం ఆర్టీసీ నిబంధనల మేరకు ఆర్టీసీ బస్టాండ్‌కి 500 మీటర్లు దూరంలోపు ప్రయివేట్ వాహనాలు ఉంచకూడదు. అయితే స్థానిక బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులు సైతం బస్టాండ్ నుంచి బయటకు రావడానికి ప్రయివేట్ బస్సులు అడ్డు ఉంచడంతో తిప్పుకోవడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అలాగే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నట్లు ప్రయిణికులు, ప్రజలు వాపోతున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కి కూతవేటు దూరంలో ప్రయివేట్ బస్సులు నిలిపి యథేచ్ఛగా ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తూ ఆర్టీసీకి నష్టం కలిగిస్తున్నా అధికారులకు పట్టదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కదిరి నుంచి బెంగళూరు వయా చింతామణి, హెచ్ క్రాస్, హొస్కోట, వైట్ ఫీల్డ్, సర్జాపుర, అత్తిబెలి మీదుగా ఎలక్ట్రానిక్ సిటీకి రాకపోకలు సాగించే ఓ ప్రయివేటు బస్సుకు అనుమతులు లేకపోయినా నడుపుతున్నట్లు సమాచారం. దీనికి తోడు ఆ బస్సును ఆర్టీసీ బస్సు వేళలో నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యాపారం జరగక అద్దె చెల్లించడం భారమైంది

కదిరి నుంచి బెంగళూరు వెళ్లే ప్రయివేటు బస్సులను దుకాణం ముందు గంటల తరబడి అడ్డుగా నిలుపుతున్నారు. దీంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కనిపించక కస్టమర్లు ఎవరూ రావడం లేదు. ఎవరైనా రావాలన్నా బస్సులు అడ్డుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారాలు సరిగా జరగక కుటుంబ పోషణతో పాటు గది అద్దె చెల్లించడం భారం అవుతోంది. అద్దె చెల్లించేందుకు ప్రతి నెలా అప్పు చేయాల్సి వస్తోంది.

రవి, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు.

ప్రయివేటు బస్సులపై చర్యలు తీసుకుంటాం

నిబంధనలు పాటించని ప్రయివేటు బస్సులపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న, ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లో నుంచి బయటకి రావడానికి మలుపులో అడ్డం ఉంచుతున్న ప్రయివేట్ వాహనాలను నియంత్రిస్తాం. ప్రయివేట్ వాహనాలను ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉంచకుండా మరొక చోట నిలిపేలా చర్యలు తీసుకుంటాం.

డీఎస్పీ శివనారాయణస్వామి



కానిస్టేబుల్ ఉద్యోగాలుకు ఎంపికైన అభ్యర్థులతో మంత్రి

కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే దేనినైనా సాధించవచ్చని మంత్రి సవిత పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 25 మందికి పైగా సివిల్, ఎపిఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. దీంతో ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి వారిని ఘనంగా సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతరం శ్రమించి విజయాన్ని సాధించడం గొప్ప విషయం అన్నారు. మీ తల్లిదండ్రుల కలలు నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉద్యోగాలు పొందిన కానిస్టేబుళ్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-నల్లమాడ

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడంతో ఆదివారం నల్లమాడలో టిడిపి ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కోట్లో మంజురెడ్డి, నితీష్‌కుమార్(సోను), వలం కిష్టయ్య, కె.శ్రీనాథ్, పాల అంజనమ్మ, శేఖర్, కృష్ణమూర్తి, మెకానిక్ సూరి, రామకృష్ణ, ఆటో బాషా, బాలిరెడ్డి, ఎస్.కేశవరెడ్డి, రవీందర్‌నాయక్, గట్ల దామోదర్, కార్యకర్తలు పాల్గొన్నారు,

అరుణాచలం, గోల్డెన్ టెంపుల్‌కి ప్రత్యేక బస్సులు

ధర్మవరం రూరల్ : ఈ నెల 9వ తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 8వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాను పోను ఛార్జీలు రూ. 1400 అన్నారు. ఆన్‌లైన్‌లో గానీ బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లో ఆకనీ సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 99592 25859లో సంప్రదించాలన్నారు.

మంత్రి చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

లో వోల్టేజి, విద్యుత్ సమస్యలతో కొంతకాలంగా పట్టణంలోని 31వ వార్డు సత్యసాయినగర్ కాలనీలోని ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు చెడిపోతున్నాయి. విద్యార్థులు సైతం చదువుకోవడానికి ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా వీధి దీపాలు లేక రాత్రి వేళ ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకేవారు. ఈ విషయాలను వార్డు ప్రజలు ఈ నెల 1వ తేదీ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించాలని ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ను ఆదేశించారు. దీంతో ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఆదివారం ఆ కాలనీలో నూతనంగా ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో నాయకులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబులేసు, మల్లికార్జున, బాలకృష్ణ, శివశంకర్, రాజు, నాగేంద్ర, రాజశేఖర్, మహేష్, నబిరసూల్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిషేధాన్ని వ్యతిరేకించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విద్యార్థుల స్వేచ్ఛను హరించి, విద్యార్థి సంఘాల గొంతు నులిమే కుట్రలను వ్యతిరేకించాలని ప్రగతి శీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఆ సంఘం నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు మినహా ఇతరులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలల్లోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం అప్రజాస్వామికం అన్నారు. ప్రభుత్వం పాఠశా లల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే సంఘాలకు అభ్యంతరం ఉండదన్నారు. అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవని, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను దోపిడీగా మార్చాయన్నారు. వాటిని వ్యతిరేకించడం ప్రభుత్వానికి సహించరానిదిగా భావిస్తోం దన్నారు. ప్రభుత్వం నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాస్కర్, మునీంద్ర, హరి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిఎం ఇనాయతుల్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18-45 ఏళ్ల లోపు వయసు ఉండి హెవీ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆర్టీవో కార్యాలయం నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. వారికి మెడికల్ చెకప్ చేసి అర్హులను విధుల్లోకి తీసుకుంటామన్నారు. ఎంపికైన వారికి రోజువారి చెల్లింపులు చేస్తామన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మడకశిర : మండలంలోని చందకచర్ల గ్రామంలో ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్రా భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కవితా సత్యనారాయణ, ఎంపిటిసిలు గోపాల్ నాయక్, మాలే రంగప్ప, సర్పం చులు కరియన్న, జయరాం, మండల కన్వీనర్ రామిరెడ్డి, నాయకులు మధుమతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భారతిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రంగేగౌడ్, రవిశేఖర్‌రెడ్డి, ఆనందరంగారెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

చెన్నేకొత్తపల్లిలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం ధర్మవరం పట్టణంలోని స్పందన ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు వైద్య శిబిరాలకు విశేష స్పందన వచ్చిందని స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. వారు మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో ఊపిరితిత్తులు, ఛాతి జబ్బులకు వైద్యులు డాక్టర్ కె.పూర్ణచంద్ర(పల్మ నాలజిస్ట్), చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మహమ్మద్ గౌస్, డాక్టర్ రితిక్ రవీంద్ర 234 మందికి ఉచితంగా చికిత్స చేయడంతో పాటు మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అర్హులైన చిన్న పిల్లలకు ఉచితంగా అడ్మిషన్ చేసుకొని ఉచితంగా చికిత్స చేశారు. శిబిరంలో స్పందన హాస్పిటల్ మేనేజర్ బాబాఫకృద్దీన్, సిబ్బంది దిల్దార్, నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

కదిరి టౌన్ : పట్టణంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనం గా నిర్వహించుకున్నారు. పలువురు బాల్య మిత్రులు స్థానిక ఎంజి రోడ్డులోని బంగారు దుకాణం వద్దకు చేరుకొని ఆత్మీయంగా పలకరించుకొని కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాల్యంలోని మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకొని సంబర పడ్డారు. అనంతరం కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



కదిరిలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న బాల్య మిత్రులు

యర్రగుంటపల్లి రేషన్ డీలర్ తొలగింపు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని ఆర్.ఎర్రగుంటపల్లి గ్రామంలో ఈ నెల 2వ తేదీ రేషన్ దుకాణంలో కార్డుదారునికి 35 కిలోల బియ్యం వేయాల్సి ఉండగా 30 కిలోలే పంపిణీ చేయ డంతో లబ్ధిదారులు డీలర్ చెన్నారెడ్డితో వాగ్వివాదానికి దిగిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆదివారం రెవెన్యూ అధికారులు ఆర్.ఎర్రగుంటపల్లిలోని రేషన్ షాపులో కార్డుదారుల సమక్షంలో విచారణ చేపట్టగా డీలర్ 5 కిలోల బియ్యం తక్కువ వేసిన మాట వాస్తవ మేనని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. తదుపరి ఆ డీలర్ షాపులో స్టాక్ ఎంత ఉంది.? ఎంత పంపిణీ చేశారు? రోజువారి రిజిస్టర్లు రాస్తున్నారా? లేదా అనే విషయాలపై పగడ్బందీగా విచారణ చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చిన వాస్తవాలు నిజమేనని తేల్చారు. ఇక స్వయంగా చెన్నారెడ్డి రాజీనామా ఇవ్వడంతో గ్రామ వీఆర్వోకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పారు. ఇదిలా ఉండగా ఈ షాపు భావన అనే మహిళ పేరుపై ఉండగా చెన్నారెడ్డి నామినీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో భావన రిజైన్ చేశారని తెలిపారు. కాగా చెన్నారెడ్డి సోషల్ మీడియాలో మాట్లాడుతూ తహశీల్దార్ 5 కిలోలు తక్కువగా ఇవ్వమన్నారు అన్నది అవాస్తవమని వారు స్పష్టం చేశారు. అధికారుల మీద తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణలో ధర్మవరం సిఎస్‌డిటిలు చెన్నకేశవనా యుడు, మునుస్వామి, గురుప్రసాద్, వీఆర్వో మధుసూదన్‌రెడ్డి, కార్డుదారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజలను ఆప్యా యంగా పలకరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు విన్నవించారు. స్పందించిన చిలకం వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా పరిష్కరించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం జడ్పీ మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి మోకాళ్ల నొప్పికి చికిత్స పొందుతూ ఇంటికే పరిమితమైన విషయం తెలియ డంతో చిలకం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.



చిగిచెర్లలో ప్రజలతో మాట్లాడుతున్న చిలకం

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-అమడగూరు

ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివా రం మండలంలోని మహమ్మ దాబాద్ పాత సచివాలయం వద్ద వెలుగు చూసింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఓడిసి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, అమడగూరు శిక్షణ ఎస్ఐ ప్రదీప్‌రాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసు అధికారులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన రంగదామప్ప కుమారుడు గూనిశెట్టి రాజేష్(36), అమడగూరు మండలంలోని మహమ్మాదాబాద్ గ్రామం బావిచెరువుపల్లికి చెందిన శ్రావణితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారి మధ్య విభేదాల వల్ల వేర్వేరుగా ఉంటున్నారు. రాజేష్ ఆదివారం మహమ్మాదాబాద్‌లోని పాత సచివాలయం వద్ద ఓ చెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. రాజేష్ తమ్ముడు బాలచంద్ర ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వెంట జమేదారు రామకృష్ణగౌడ్, సిబ్బంది సుధాకర్, రమేష్, విజయ్‌భాస్కర్ ఉన్నారు.

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లి సెయింట్ మేరీ పాఠశాల వెనుక భాగంలో ఆదివారం ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాలు.. మండలంలోని కొడిగెనహళ్లి వినాయకనగర్ కాలనీకి చెందిన సన్నక్క(50) హిందూపురం ప్రాంతంలోని ఓ గార్మెంట్స్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తూ ఉండేది. ఈ క్రమంలో శనివారం పని ముగించుకుని ఇంటికి చేరుకుంది. ఆదివారం ఉదయం సెయింట్ మేరీ పాఠశాల వెనుక భాగంలో ఆమె మృతదేహం లభ్యమవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. విషయం తెలిసిన వెంటనే ఎఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంకు, డాగ్ స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన తల్లి మృతిపై విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని సన్నక్క కుమార్తె అంజలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లేపాక్షి : మండలంలోని పులమతి పంచాయతీలోని తిలక్ నగర్‌లో ఆదివారం దాదాపీర్(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మృతుడిని హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని గుడ్డంకు చెందిన దాదాపీర్‌గా గుర్తించారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత శనివారం మిత్రుడితో కలిసి బయటికి వెళ్లిన దాదాపీర్ ఆదివారం తిలక్‌నగర్‌లో విగతజీవిగా పడి కనిపించాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అతడి మృతికి గల కారణాలు విచారణలో వెల్లడిచేస్తామని పోలీసులు తెలిపారు.

మందుబాబులు, పేకాట జూదరులపై కేసు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పోలీసులు ఆదివారం కదిరి పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను ఉపయోగించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఐదుగురిని, పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి రూ. 70 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. గంజాయి, జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శివనారాయణ స్వామి హెచ్చరించారు.

పోగొట్టుకున్న బంగారు వస్తువులు అందజేత

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఓ వ్యక్తి అజాగ్రత్తగా పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అతడికి అందజేశారు. వివరాలు.. పెనుకొండ మండలంలోని శెట్టిపల్లితండాకు చెందిన వెంకటేష్‌నాయక్ కదిరి పట్టణంలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యాడు. ఆ సమయంలో తన జేబులో నుంచి బంగారు వస్తువులు పడిపోయాయి. అతడి వెనుక వస్తున్న పట్టణంలో ఓ మెడికల్ ఏజెన్సీలో పని చేసే పృథ్వీ వాటిని చూసి తీసుకెళ్లారు. ఇంతలో వెంకటేష్ తన బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. వెంకటేష్ సంచరించిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. అతడు బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న ప్రదేశం, తీసుకున్న వ్యక్తి దృశ్యాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. కదిరి టౌన్ సిఐ నారాయణరెడ్డి వాటిని స్వాధీనం చేసుకుని వెంకటేష్‌కు అందజేశారు. ఈ విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఉపాధ్యాయ దినోత్సం పురస్కరించుకుని యుటిఎఫ్ సీనియర్ ఉపాధ్యాయులు రామాంజనేయులు జ్ఞాపకార్థం ఆదివారం పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో చిలమత్తూరు ఉపాధ్యాయుల జట్టు గోరంట్ల టీచర్స జట్టుపై 6 వికెట్ల తేడాతో విజయఢంకా మోగించింది. మొదట బ్యాటింగ్ చేసిన గోరంట్ల 12 ఓవర్లలో 83 పరుగులు చేసింది. అనంతరం చిలమత్తూరు జట్టు 8 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించింది. కెప్టెన్ రవికుమార్ 2 కీలక వికెట్లు పడగొట్టి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకు న్నాడు. రజాక్ 41 పరుగులతో రాణించాడు. కార్యక్రమంలో సుందర్‌రాజు, విశ్వనాథరెడ్డి, శరత్‌కుమార్, రామచంద్ర, వేణుగోపాల్, నరేష్‌నాయక్, జగదీష్, లోకేష్, కాంతరాజ్, చంద్రమౌళి, రియాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌కు బ్రాహ్మణ సంఘం సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బ్రాహ్మణ సముదాయ భవనంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్.గురుమూర్తిని సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ బ్రాహ్మణుల శ్మశానవాటికకు స్థలం కేటాయించి బోరు వేయించాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పింఛను, రేషన్‌కార్డు, పక్కా గృహాలు మంజూరు చేయించాలని, ఆలయాల్లో ధూప దీప నైవేద్యం పథకాన్ని వర్తింపచేయాలని కోరారు. స్పందించిన గురుమూర్తి ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.